కథా నిలయం
...కాకుళం



# దేశమంటే చావలాయ్

— జ్యోత్స్న

ఉదయంనుండీ శకుంతల ఆ కిటికీని పట్టుకునే వేలాడుతోంది కొమ్మను పట్టుకుని వేలాడే మందారంలా! ఆ చూపులకు మరో అర్థం నిరీక్షణ! రోజూ ఉదయం పూట పదిగంటలనుండి పన్నెండు గంటల వరకూ అలా నిరీక్షిస్తూ కూర్చోవడం ఆమె దైనందిన జీవితంలో ఒక భాగం అయిపోయిందీమధ్య. ఆమె చూపుల తుమ్మెదలు వీధి వీధినంతా కలియతిరుగుతూ వెదుకుతున్నాయి పోస్ట్‌మాన్ కనిపిస్తాడని.

వారం రోజులనుండీ కవి పిస్తూనే వున్నాడు. ఓ రోజు తమ వీధి అంతా సంచరించాడు. ఒక రోజు తమ ఒక్క యిల్లూ విడిచి పెట్టి ప్రక్కనున్న మిగతా రెండిళ్ళకీ వుత్తరాలిచ్చాడు. ఓ రోజు వీధి చివరలోనే మెరుపు మెరిపినట్లు మెరిపి మాయమై పోయాడు. కానీ వారం రోజుల నుండీ వస్తుందని ఆతృతతో ఎదురు చూస్తున్న తన వుత్తరాన్ని మాత్రం యింతవరకూ తనకివ్వ లేదు. రోజురోజుకీ యిలా నిరీక్షణతో తనని కాలుస్తున్నాడు. ఈ రోజైనా తన యింటి మెట్లెక్కి తను ఆతృతతో ఎదురు చూస్తున్న 'ఆ వుత్తరాన్ని' తనకిస్తాడోలేదో?!

రెండు కళ్ళనీ కిటికీకి అతికించేసి, తన మనసుని ఒక వారం రోజులు వెనక్కి పంపించింది శకుంతల.

పెళ్ళి చూపుల పేరిట సంతలోని పశువులా అలా ఓ మగాడి ముందు కూర్చోవడం అప్పటికి పదోసారి.

గత తొమ్మిది సార్లూ జరిగినట్లే ఈ సారీ కట్నం దగ్గర మగ పెళ్ళి వాళ్ళ అసంతృప్తీ— శకుంతల నాన్నగారి అర్థింపూ, మధ్య కొంత వాదన జరిగింది. కాకపోతే పెళ్ళికొడుకు కూడా ఆ వాదనలో కలుగజేసుకోవడం ఈ సారి విశేషం.

"అమ్మా! అమ్మాయి నాకు నచ్చింది! వారి స్థితిని మించి అడగొద్దు!" అని పెళ్ళికొడుకు చెప్పినపుడు—

తనకు పెళ్ళవుతుందన్న ఆనందం కంటె, ముగ్గురాడపిల్లల పెళ్ళిళ్ళను భరించాల్సిన తన తండ్రి గుండెల మీంచి ఓ 'కుంపటి' తొలగుతోందని సంతోషించింది.

ఆ అబ్బాయి వెళ్తూ వెళ్తూ తనతో—"అమ్మా నాన్న కాస్త అభ్యంతరం చెప్తారు. అయినా మీరు నాకు నచ్చారు. వారికి నచ్చజెప్పి, వెళ్ళగానే అన్ని విషయాల్తో మీ నాన్నగారికి ఉత్తరం రాస్తాను" అంటూ తనలో నమ్మకాన్ని నాటి వెళ్ళాడు.

ఆ మరుసటిరోజు నుండీ తన బతుకులో ఈ నిరీక్షణ చోటు చేసుకుంది. రోజు రోజుకీ ఈ 'నిరీక్షణ' మీద నమ్మకమూ సన్నగిల్లుతోంది.

ఇంక వుత్తరం రాదేమో? వారు అడిగినంత కట్నం యివ్వలేని తన తండ్రి అశక్తత ఈ సంబంధాన్ని దూరం చేస్తుందేమో? ఆ తల్లి దండ్రులయిద్దరి పట్టుదల ముందు

ఆ అబ్బాయి ఓడిపోక తప్పదేమో? తనరాత మొదటికి....

నో....! యింక ఆ పరిస్థితి తాను ఎదుర్కోలేదు. ప్రతి మగ వాడి ముందూ అలా ఓ మనసు లేని బొమ్మలా, సంతలోని పశువులా కూర్చుని శల్యపరీక్ష చేయించుకోలేదు! ఈ బతుక్కి యింక యివే ఆఖరి పెళ్ళి చూపులు కావాలి....

అనంతంగా సాగిపోతున్న శకుంతల ఆలోచనలు ఓ గమ్యానికి చేరుకున్నాయి!

"పోస్ట్!"

పోస్ట్‌మేన్ వచ్చాడు! ఒక్క ఉదుటున యింట్లోంచి వీధిలోని కొచ్చింది.

కానీ, పోస్టుమేనొచ్చింది తన యింటికి కాదు. పక్కింటికి.

పక్కింట్లో ఉత్తరం పడేస్తూ, 'మీకేం లేవమ్మా' అంటూ ప్రశ్నించక పోయినా అందరికీ యిచ్చే జవాబొకటి ఆమెకు యిచ్చి వెళ్ళి పోయాడు పోస్ట్‌మేన్.

* * *

ఉదయంనుండీ చాలా చిరాకుతో వున్నాడు సుధాకర్.

పాపం! ఆ నిరుద్యోగి చాలా రోజులనుండీ అలా చిరాకు పడు తూనే బతుకుతున్నాడు.

మొన్న యింటిగలాయనొచ్చి బాకీ వున్న మూన్నెళ్ళ అద్దె ఇవ్వక్కర్లేకుండానే ఇల్లు ఖాళీ చెయ్యమన్నాడు.

ఇంక నిలువ నీడ ఉండదన్న భయంలోంచి—

నిన్న, ఉన్న ఒక్క జత బట్టలూ జాగ్రత్తగానే ఉతుకుతుంటే, శిధిలావస్థలోనున్న చొక్కా చిరిగి ముక్కలయింది!

వళ్ళు దాచుకు నేందుకింకేం లేదన్న భయంలోంచి—

ఉన్న చిల్లర డబ్బులు కాస్తా నిన్నటితోనే అయిపోతే, ఈరోజు కనీసం బన్నురొట్టె, టీ చుక్కల కైనా నోచుకోక—

ఆకలికి బలైపోవాలన్న భయం లోంచి—

చిరాకు! చిరాకు! భయంలాంటి చిరాకు!

అన్నింటిని మించి మొన్న ఎటెండ్ అయిన ఓ ప్రయివేటు కంపెనీలోని యింటర్వ్యూలో, తను తప్పక సెలెక్ట్ అవుతాడన్న నమ్మ కానికి ప్రాణం పోస్తూ రావలసిన ఉత్తరం ఇంకా రాకపోవడంతో రాని ఉత్తరంపై చిరాకు!

"మిమ్మల్ని మేం తప్పకుండా గుర్తుంచుకుంటాం" అంటూ ఇన్ డైరెక్ట్‌గా వారు అందించిన అభి

నందన తనలో చిగురింపజేసిన ఆశ....

అన్నీ 'ఎప్పాయింట్‌మెంట్ అర్డర్' రూపంలో ఇంకా రావేం?

ఆ శుభవార్తను మోసుకొచ్చే పోస్టుమేన్ యింకా రాడేం?

రోజూ ఏవో యింటర్వ్యూ కాల్సనీ 'ఈ ఉద్యోగం మీకు ఇవ్వలేకపోతున్నందుకు చింతిస్తున్నాం' వంటి వుత్తరాల్ని తెచ్చే పోస్టుమేన్ మూడు రోజులై తన గుమ్మమే ఎక్కడం లేదేం?

చిరాకుపడుతూనే ఆలోచిస్తున్నాడు సుధాకర్.

* * *

"రామారావుగారూ! యూనియన్ హెడ్డాఫీసునుండి ఏమైనా ఇన్ఫర్మేషన్ వచ్చిందాండీ!" ఆఫీసు టైమ్‌కి ఓ అరగంట ఆలశ్యంగా వస్తూ అడిగాడు ఆర్‌ఎమ్మెస్ (రైల్వే మెయిల్ సర్వీస్) సార్టింగ్ క్లర్కు విశ్వనాధం.

అప్పటికే ఓ వుత్తరాన్ని చదువుతున్న రామారావు, "వచ్చిందండీ ఆఫీస్ అవర్స్‌కి మించి ఒక్క నిముషం కూడా ఎక్కువ పని చెయ్యొద్దని" జవాబిచ్చాడు రామారావు.

"మూడ్రోజులనుండీ మనం చేస్తున్నపని అదే కదటండీ! ఇంకా ఎన్నాళ్ళు?" తన సీట్లో కూర్చుంటూ ఆ పెద్ద హాల్లో సగానికి పైగా ఆక్రమించి కుప్పలు కుప్పలుగా పేరుకుపోయిన ఉత్తరాల సంచుల వైపు చూస్తూ అన్నాడు.

విజానికెప్పుడు ఆ గదిలో ఉత్తరాల సంచులు అలా పేరుకుపోయి వుండవు—

పి&టి డిపార్ట్‌మెంట్ వాళ్ళకు అంతవరకూ ఇస్తున్న ఓవర్‌టైమ్‌ని ఇకముందు రద్దు చేస్తున్నట్లు పి&టి మినిస్టర్‌గారు చేసిన ప్రకటన.

ఆ వార్త పోస్టాఫీసులన్నింటిలోనూ బోల్డు సంచలనాన్ని రేపింది పి&టి యూనియన్‌కి బోల్డంత పని కల్పించింది.

ఆఫీసు టైంలో బాతాఖానీ కొడుతూ, హాయిగా కబుర్లాడుతూ, ఓవర్‌టైంలో మాత్రమే పని చెయ్యడానికి అలవాటుపడిన సార్టింగ్ క్లర్కులందరికీ ఒళ్ళు మండిపోయింది. ఆ మినిస్టర్‌గారు గాని ఎదురైవుంటే ఉత్తరాలు కుప్పల్లో పెట్టి కాల్చేసుందురు.

ఆఫీస్ అవర్స్‌లో ఎలాగూ పనిసాగదు, సాగినా నత్త నడక వ్యవహారం. కాబట్టి ఏ రోజు కా రోజు సార్టింగ్ అయి 'క్లియర్' కావలసిన వుత్తరాలు సంచులతో కుప్పలు కుప్పలుగా వుండిపోవడం

ప్రారంభించాయి. ఎందుకంటే అన్ని సంచులూ ఆఫీస్ అవర్స్‌లో క్లియర్ కావు. ఇంతకుముందు ఓవర్ టైంలో మాత్రమే చేస్తుండే వారుగనుక చెయ్యాలంటే వున్న 'స్టాఫ్' చాలదు. ఇంకొంతమంది సార్టింగ్ క్లర్క్స్ కావాలి. ఓవర్ టైంమే రద్దు చేస్తున్నప్పుడు కొత్తగా ఎపాయింట్‌మెంట్స్ కొశ్చన్ ఎరైజ్ అవదు!

అందుకని ఆ సంచులు అలా రోజు రోజుకీ వందలకొలదీ ఉత్తరాలను మోసుకొచ్చి అలా అక్కడ చిన్న చిన్న గుట్టల్లా పడి వుంటాయి.

ఆఫీసు సమయంలో కూడా విశ్వనాథం, రామారావు రెండు గంటలకు పైగా బాతఖానీ చెప్పు కున్నారు- పనిమానేసి.

* * *

"అమ్మా! రాణీ! హైద్రాబాద్‌లో నీ ఇంటర్వ్యూ ఎప్పుడన్నావమ్మా?"

వరండాలో వాలుకుర్చీలోంచి పేపరు చదువుతూ లోపలికి కేకేశారు పరంధామయ్యగారు

ఓ విరబూసిన సన్నజాజి తీగె లాంటి ఈడొచ్చిన లేడిపిల్లలాంటి ఇరవైయేళ్ళ ఆడపిల్ల ఇంట్లోంచి బయటకొచ్చి—

"పన్నెండో తేదీన నాన్నారూ!" అంది.

"ఐతే పదో తేదీనే నువ్వు హైద్రాబాద్ వస్తున్నట్లు నిన్ను రిసీవ్ చేసుకునేందుకు అన్నయ్యను స్టేషన్‌కి రమ్మని ఇవాళే ఉత్తరం వ్రాస్తాను. వెళ్ళేముందు ఓ టెలిగ్రాం ఇచ్చి బయల్దేరుదువు గాని" అన్నారు పరంధామయ్యగారు.

సుధారాణి ఇంట్లోకెళ్ళి ఓ కలం ఓ ఇన్‌లెండ్ లెటర్ తెచ్చి తండ్రి కిచ్చింది

పరంధామయ్యగారు హైదరాబాద్‌లో వుద్యోగం చేస్తున్న తన కొడుక్కి వుత్తరం రాయడంలో మునిగిపోయారు.

* * *

"మొత్తానికి మన పంతమే నెగ్గింది సుమండీ! ఓవర్ టైం గ్రాంట్ చేశారు చెయ్యకేం చేస్తారు? ఈ కొద్ది రోజుల్లోనే ప్రజల్లో ఎంత సంచలనం రేగిం దనీ! వుత్తరాలు సక్రమంగా అందక" చేతిలోని 'ఆర్డర్' ను ఆనందంతో చదువుతూ అన్నాడు విశ్వనాథం.

"అలజడి రేగదుటండీ! మన చిన్న వూళ్ళలోనే ఇలా వందల కొలది వుత్తరాల సంచులు గుట్టలు గుట్టలుగా పేరుకొని వుండిపోతే

హైద్రాబాద్, విజయవాడలాంటి నగరాల్లో వేలకొలదీ బ్యాగులుండి పోవుటండీ!" జవాబిచ్చాడు రామారావు. ఓవర్ టైమ్ వచ్చినందుకు అందరిలో సంతోషం!

మర్నాడు ఆరెమ్మెస్‌కి తణిఖీ కొచ్చే ఆఫీసర్ అక్కడి ఉద్యోగులంతా నిజాయితీగా, మంచి కార్య దీక్షతో పని చేస్తున్నట్లు గుర్తిస్తాడు.

* * *

"టెలిగ్రాం ఇద్దామంటే లైను బాగులేదుటమ్మా!" అంటూ దిగాలుగా చెప్పారు పరంధామయ్య గారు.

"ఫర్వాలేదు నాన్నారూ ఓ వారం రోజులముందే ఉత్తరం రాశాంగా? అది ఈపాటికి అన్నయ్యకు అందే వుంటుంది. తను తప్పక స్టేషనుకి వస్తాడు" అంటూ హైద్రాబాద్ ప్రయాణమైంది సుధారాణి.

* * *

ఆకాశం చీకట్ని రాలుస్తోంది! నిశ్శబ్దం ఆ చీకటితో ఆడుకొంటోంది!

ఆ ఆట పేరు 'రాత్రి' ట!

పెరట్లో ఇంటి మెట్ల మీద కూర్చొని మౌనంగా రోదిస్తోంది శకుంతల.

ఆమె ఓ ఉత్తరం కోసం, ఆ ఉత్తరం తెచ్చే శుభవార్త కోసం నిరీక్షించి, నిరీక్షించి అలసిపోయింది!

అసలు జీవితానికన్నా మిగతా కాలంకోసమే ఆమె నిరీక్షించ దలచుకోలేదు.

తనకు మళ్ళీ జన్మంటూ వుంటే భారతదేశంలో మధ్యతరగతి ఆడపిల్లగా మాత్రం పుట్టించొద్దని ఆ కనిపించని దేవుణ్ణి మూగ వేదనతో వేడుకొంటోంది!

కొంత సమయం తర్వాత ఆమె మెట్లమీదనుండి లేచి ముందుకు నడిచింది. ఆనడక పెరటిలోని నూతివేపు!!

మరునటిరోజు పేపర్లో కవితాత్మకంగా ఓ జర్నలిస్టు 'వరకట్న వధ్యశిలపై వధువు' అని ఓ వార్త వ్రాసుకుంటాడు.

* * *

సుధాకర్! నడుస్తున్నాడు

తను ఆశించిన ఎపాయింట్ మెంట్ ఆర్డర్ కాదుకదా మూడు రోజుల నుండీ మునుపటిలా ఇంటర్వ్యూ కాల్స్ కూడా రావడం లేదు. పోస్టు మేన్ ముఖంచూసి ఓ యుగమైనట్లు అనిపిస్తోంది!

బ్రతుకుమీద ఆశ పూర్తిగా చచ్చిపోయింది. అందుకే తనా

నిర్ణయానికొచ్చాడు. అతడు అడు గుల వేగం పెంచాడు.

దూరంగా ఎక్కడ్నించో అతనికి రైలు కూత వినిపించింది.

తను ఆశించిన వుద్యోగం తనకు నిజంగానే వచ్చిందనీ పోస్టల్ వాళ్ళ సమ్మెకారణంగా ఆ వుత్తరం తనకు రేపు అంద బోతోందనీ అతనికి తెలిస్తే ఎంత బాగుండును?

మరునాడు పేపర్లో 'నిరు ద్యోగ రక్కసి కోరల్లో పడి నలి గిన యువకుడు' అంటూ ఓవార్త!

* * *

హైద్రాబాద్లో—

అప్పటికి బండి ప్లాట్ఫారం మీదకిచేరి పావుగంటవుతోంది. ప్లాట్ఫామ్ అంతా ఎన్నిసార్లు గాలిం చినా తన అన్నయ్య కనిపించలేదు సుధారాణికి.

అన్నయ్య ఎందుకు రాలేదు చెప్మా! అంటూ మళ్ళీ మళ్ళీ వెది కింది. ప్లాట్ఫాంనిండాఎందరో మగ వాళ్ళలో తను వెదుకుతున్న మగ వాడు మాత్రం లేడు!

ఒకవేళ ఆ ఉత్తరం అందక పోతే.

ఏమీ తెలీని క్రొత్త ప్రదే శంలో కొత్త వ్యక్తుల మధ్య తన గతేమిటి??

ఏమో మరో రమీజాబీ కావొచ్చు!!

మరో చబీరాణి కావొచ్చు!!

హైద్రాబాద్లోనే—

దేశంలో విపరీతంగా పెరిగిపోతున్న హత్యలపట్ల, ఏక్సిడెంట్ల పట్ల సానుభూతి చూపుతూ జరుగనున్న ఓ సంతాప సభలో, ప్రసంగించా ల్సిన ఓ మంత్రిగారికోసం, తన చుట్టూ కొన్ని వార్తాపత్రికల్ని పేర్చుకుని ఆ ఉపన్యాసాన్ని ముందుగా వ్రాస్తున్నాడు ఆ మంత్రి గారి సెక్రటరీ.

"పుట్టిన ప్రతిమనిషీ చావక తప్పదు. మరి అటువంటప్పుడు చావును ఒక భయంకర సంఘ టనగా తీసుకొని ప్రజలిలా బాధ పడిపోయి అలజడులను రేపడం అర్థంలేని పని! రోజు రోజుకీ అంతులేకుండా పెరిగిపోతున్న జనాభా దృష్ట్యా మన దేశానికి ఇలాంటిచావులు ఎంతయినా అవ సరం.... ఎంతయినా అవసరం.... అసలు దేశమంటే మనుషు లోయ్! అన్న ఆ మహానుభావు డెవరో మరో విషయాన్ని చెప్పడం మరచాడు.... అదేమిటంటే.... దేశ మంటే..." వ్రాసుకుపోతున్నాడు సెక్రటరీ! *